'సదరం' స్లాట్ విడుదల

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 5: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందేందుకు ఈ నెలతోపాటు ఫిబ్రవరి, మార్చి నెలలకు స్లాట్లను ప్రభుత్వం విడుదల చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ వారి వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. స్లాట్లు బుక్ చేసుకున్న వారికి ఈ నెల 8వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో 173 ప్రభుత్వాసుపత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు నిర్వహించి సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు.

నీటి మాటలు



- అమలు కాని వైఎస్సార్ జలకళ పథకం
- ఉచితమని ఊరించారంటున్న రైతులు
- చేతులెత్తేసిన గుత్తేదారులు
- రైతులే చూసుకోవాలంటున్న అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 5 :

రెండు లక్షల మంది రైతులకు వ్యవసాయ బోర్లు ఉచితంగా తవ్విస్తాం..కేసింగ్ పైపు అందిస్తాం.. మోటార్లు బిగిస్తాం.. సర్వేకు అయ్యే ఖర్చులన్నీ భరిస్తాం.. పైసా ఖర్చు పెట్టుకోవాల్సిన పని లేదు.. అని 2020, సెప్టెంబరు 28న వైఎస్సార్ జలకళ పథకం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. ఈ మాటలకు చిన్న సన్న కారు రైతులు సంబరపడిపోయారు. కానీ వారికి ఆ సంతోషం దక్కలేదు. ఉచితంగా బోర్లు వేయిస్తామనే హామీ అమలు కాలేదు. నాలుగు సంవత్సరాల్లో రెండు లక్షల బోర్లు తవ్విస్తామనే మాట గాలికిపోయింది. వైసీపీ ఉచితంగా మాటలు చెప్పడం తప్ప ఏ వాగ్దానాన్ని అమలు చేయలేదని, ఈపాటి దానికి ఎన్టీఆర్ జలకళ పేరు మార్చి వైఎస్సార్ జలకళ అనే ఊదరగొట్టడం ఏందుకని రైతులు మండిపడుతున్నారు.

వైఎస్సార్ జలకళ పథకం గురించి ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటన చేసింది. నాలుగేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఉచితంగా బోర్లు వేయించి, మోటార్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కి నాలుగు సంవత్సరాల్లో రూ. 2,340 కోట్లు ఖర్చు చేస్తామని సీఎం జగన్ చెప్పారు. బోరు తవ్విన తర్వాత మోటార్ల కోసం రూ.1600 కోట్లు, విద్యుత్ ఫీడర్ల కోసం రూ.1700 కోట్ల నిధులను వెచ్చిస్తామని ప్రకటించారు. కానీ ఆచరణలో ఈ ఉచితాలేవీ అమలు కాలేదు.

ఎన్టీఆర్ జలసిరి పేరు మార్చి వైఎస్సార్ జలకళగా..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ జలసిరి పథకం ద్వారా బోర్లు తవ్వి మోటారు సోలార్ ప్యానెల్‌ను అమర్చి అన్నదాతలకు సాగునీటి భరోసాని కల్పించారు. వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకం పేరును వైఎస్సార్ జలకళగా మార్చింది. నీటి సదుపాయం లేని మెట్ట భూముల్లో బోర్లు తవ్వి కేసింగ్ పైపులు వేస్తామని చిన్న సన్న కారు రైతులకు సోలార్ కాకుండా విద్యుత్ కనెక్షన్లతో పాటు మోటార్లు కూడా ఉచితంగా ఇస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ ప్రకటించారు.

నియోజకవర్గానికి 500 బోర్లు..

జిల్లాలో ఐదెకరాల్లోపు రైతులకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద బోరు తవ్వి మోటారు బిగించి హెచ్‌డీపీఈ పైపులు, ఎలక్ట్రికల్ కేబుల్, ప్యానెల్ బోర్డు, విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. ఒక రైతుకు గానీ అంతకంటే ఎక్కువ మంది రైతులకు గానీ ఐదెకరాలకు ఒక బోరు వేస్తారు. ఒక నియోజకవర్గానికి 500 బోర్లుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

దరఖాస్తుల పరిశీలన

గ్రామ వలంటరీ ద్వారా గ్రామ సచివాలయంలో రైతులు సమర్పించిన దరఖాస్తులను వీఆర్వో చూపిన అనంతరం డ్వామా ఏపీడీ పరిశీలిస్తారు. ఏపీడీ ద్వారా భూగర్భ జలాల సర్వే కోసం జియాలజిస్టుకు పంపుతారు. అక్కడ నుంచి అనుమతి రాగానే కాంట్రాక్టరు బోరుబావులను తవ్వుతారు.

ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు

మెట్ట, బీడు భూములు పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. బోరు వేయడం పూర్తయిన తర్వాత కాంట్రాక్టరుతో పాటు లబ్ధిదారుడి సమక్షంలో జియో ట్యాగింగ్‌తో కూడిన డిజిటల్ ఫొటో తీస్తారు.

ఆచరణలో శూన్యం



విద్యుత్ కనెక్షన్లు, మోటారు, పంపుసెట్లు ఉచితంగా ఇస్తామని సీఎం జగన్ రైతులకు ఆశలు కల్పించారు. వ్యవసాయానికి పెద్దపీట వేశామని గొప్పలు చెప్పారు. కానీ ఆచరణలో ఇవేవీ చేయలేదు. ఫలితంగా వైఎస్సార్ జలకళ పథకం రైతులకు కలగా మిగిలిపోయింది. తొలుత బోరు వేయించి మోటారు ఉచితంగా ఇస్తామన్నారు. కానీ బోరు మాత్రమే వేయించారు. విద్యుత్ భారం ప్రభుత్వం భరిస్తుందని మొదట అన్నారు. ఇప్పుడు దాన్ని రైతుల పైకి నెట్టేశారు. రైతులే బోరు విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ కొత్త లైను ఏర్పాటు చేసుకోవాలని తేల్చేశారు. ముందొక మాట, తర్వాత ఇంకో మాట. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.



ఉమ్మడి జిల్లాలో బకాయిలు సుమారుగా రూ.10 కోట్లు

కర్నూలు జిల్లాలో వైఎస్సార్ జలకళ వివరాలు

- వీర్వోలు పరిశీలించినవి 18,412,
- జియాలజిస్టు/కాంట్రాక్టరు అనుమతి పొందినవి 3,468
- ఏపీడీ ఆమోదించినవి 3,183
- వేసిన బోర్ల సంఖ్య 1,514
- విద్యుత్ కనెక్షన్లు 324
- ఇచ్చిన పంపు సెట్లు 20

నంద్యాల జిల్లాలో జలకళ వివరాలు

- వీఆర్వోలు పరిశీలించినవి 14,224
- జియాలజిస్టు/కాంట్రాక్టరు అనుమతి పొందినవి 3,444
- ఏపీడీ ఆమోదించినవి 3,286
- వేసిన బోర్లు 2017, ఖర్చు రూ.18 కోట్లు
- విద్యుత్ కనెక్షన్లు 322
- ఇచ్చిన పంపు సెట్లు 41



ఎన్టీఆర్ జలసిరి సోలార్ బోరు

చేతులెత్తేసిన గుత్తేదారులు

బీడు, మెట్ట భూముల్లో బోర్లు వేయిస్తామని ప్రభుత్వం చెప్పడంతో రైతులు ఆశతో వైఎస్సార్ జలకళకు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని గ్రామ వీఆర్వో, ఏపీడీ ఆమోదించారు. రైతుల మెట్ట, బీడు భూములను భూగర్భశాఖకు చెందిన జియాలజిస్టు సర్వే చేసి బోరు వేయవచ్చని అనుమతి ఇస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో రింగ్ యాజమాన్యం నుంచి టెండర్లు ఆహ్వానించారు. ఒప్పందం కుదిరిన తర్వాత తొలి ఏడాది పనులు చేపట్టారు. ఆ తర్వాత వారు నెమ్మదిగా ముఖం చాటేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల, కొన్ని ప్రాంతాల్లో గిట్టుబాటు కాకపోవడం వల్ల వారు ఆసక్తి చూపలేదు. వైఎస్సార్ జలకళ పథకానికి నిధులు నిలిపివేసింది. బోర్లు వేసేందుకు రింగు యజమాన్యులు ముందుకు రావడం లేదు. బోర్లు తవ్విన గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతో జిల్లాలో తవ్వకాలను నిలిచిపోయాయి. అక్కడక్కడ తవ్విన బోర్లు వృథాగా పడి ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న రైతులకు నిరాశే మిగిల్చింది. జలకళ పథకంలో మంజూరు చేసి తవ్విన బోరు బావులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

నిధులు విడుదలైతే బకాయిలు చెల్లిస్తాం



వైఎస్సార్ జలకళ పథకం కింద బోర్లు వేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే చెల్లిస్తాం. త్వరలో పంపుసెట్లు రైతులకు వస్తాయి.

- అమర్నాథ్ రెడ్డి, డ్వామా పీడీ

కేఎంసీ క్యాంటీన్‌కు నోటీసు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 5: కర్నూలు మెడికల్ కాలేజీలోని క్యాం టీన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) శుక్రవారం నోటీసు అంటించింది. గత నెల 30న క్యాంటీన్‌ను నిర్వహించే నిర్వాహకుడు ఖాళీ చేసి వెళ్లారు. దీంతో కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఏపీజీడీఏ నూతన కార్యవర్గం క్యాంటీన్‌కు తాళం వేసి స్వాధీనం చేసుకుంది. ఈవిష యాన్ని ప్రిన్సిపాల్‌కు తెలియజేసింది. ఏపీజీడీఏకి తెలియకుండా క్యాంటీన్‌ను తెరవకూడదని నోటీసులో పేర్కొంది.

కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు



కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని భిక్షాటన చేస్తున్న కార్మికులు

కర్నూలు (న్యూసిటీ), జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా చిన్నచూపు చూస్తోందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి అన్నారు. ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారానికి మూడో రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ పారిశుధ్య కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, టైం స్కేల్ టాయిలెట్స్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ తక్షణమే మంజూరు చేయలని కోరారు. కార్మికులకు పండుగ, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, రాష్ట్ర నాయకులు మనోహర్‌మాణిక్యం, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పాడె

- దిష్టిబొమ్మ దహనానికి అంగన్‌వాడీల యత్నం
- అడ్డుకున్న పోలీసులు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 5: కర్నూలు జిల్లాలో అంగన్‌వాడీల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 25 రోజులుగా సమ్మె, నిరసనలు చేస్తున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వానికి పాడె కట్టారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో అంగన్‌వాడీలు, యూనియన్ నాయకులకు పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తగా మారడంతో మరికొంతమంది పోలీసులు నిరసనకారుల వద్దకు చేరుకున్నారు. చివరకు పోలీసులు సీఎం దిష్టిబొమ్మను లాక్కున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మునెప్ప, చంద్రశేఖర్ సీఐటీయూ నాయకులు గోపాల్, సాయిబాబా, రఫీ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



పాడె వద్ద విలపిస్తున్న అంగన్‌వాడీలు

నాడు రికవరీ.. నేడు చెల్లింపులా..?

- కేడీసీసీబీలో రిటైర్ అయినా విధుల్లో కొనసాగిన ఉద్యోగి
- వెలుగులోకి రావడంతో జీత భత్యాలు రికవరీ
- తాజాగా పని చేసిన కాలానికి జీతాలు ఇచ్చేందుకు ప్లాన్
- నేడు పాలకవర్గ కమిటీ సమావేశంలో అజెండాలో పెట్టే అవకాశం

కర్నూలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీబీ)లో పని చేసే మేనేజరు రామచంద్రారెడ్డి 2022 డిసెంబరు 31న పదవీవిరమణ కావాల్సి ఉంది. అధికారుల పొరపాటునో, సిబ్బంది నిర్లక్ష్యమో.. సదరు ఉద్యోగి తన రిటైర్మెంట్ తేదీ మరిచిపోయారో వారికి తెలియాలి. అధికారికంగా 2022 డిసెంబరు 31న రిటైర్డ్ అవ్వాల్సి ఉన్నా.. 2023 జూలై 31వ తేదీ వరకు బ్యాంక్ మేనేజరుగా కొనసాగారు. నెలనెల క్రమం తప్పకుండా జీతాలు తీసుకుంటున్నారు. ఆయన రిటైర్మెంట్ విషయాన్ని పీఎఫ్ అధికారులు గుర్తించడంతో బ్యాంకు అధికారులు షాక్‌కు గురయ్యారు. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ఆగమేఘాల మీద మేనేజర్ రామచంద్రారెడ్డితో పదవీ విరమణ చేయించి ఆగస్టులో సాగనంపారు. రిటైర్డ్ అయినా విధుల్లో కొనసాగేలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత విభాగం అధికారులు, సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. రిటైర్డ్ అయినా విదుల్లో కొనసాగడం తన తప్పిదమే అంటూ రామచంద్రారెడ్డి కేడీసీసీబీ సీఈఓకు లేఖ రాశారు. 2023 జనవరి 1 నుంచి జూలై వరకు ఆరు నెలలు తీసుకున్న జీతాలు సహా ఇతర అలవెన్సులు కలిపి రూ.5,56,896 తిరిగి బ్యాంక్‌కు చెల్లించారు. ఈ విషయంలో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా అందుకు తనదే బాధ్యత అంటూ ఆ లేఖలో పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా 'రిటైర్డ్ అయినా నాతో పని చేయించుకోవడం బ్యాంక్ అధికారుల తప్పు. నాతో పని చేయించుకున్న ఆరు నెలల కాలానికి రావాల్సిన జీతభత్యాలు ఇవ్వాలి..' అంటూ తాజాగా రామచంద్రారెడ్డి కేడీసీసీబీ సీఈవోకు వినతిపత్రం అందజేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో శనివారం జరిగే పాలకవర్గం మండలి సమావేశంలో ఈ అంశాన్ని అజెండాలో చేర్చి చర్చించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇంత తతంగం తర్వాత మళ్లీ సదరు మాజీ అధికారి నుంచి రికవరీ చేసిన రూ.5.56 లక్షలు తిరిగి ఆయనకు ఇచ్చేలా పావులు కదపడం పలు విమర్శలకు తావిస్తోంది.



రిటైర్మెంట్ కాలంలో తీసుకున్న రూ.5.56 లక్షలు తిరిగి చెల్లించినట్లు కె.రామచంద్రారెడ్డి కేడీసీసీబీ సీఈఓకు రాసిన లేఖ



కేడీసీసీ బ్యాంక్

బాబు సభకు ఏర్పాట్లు

- 12 ఎకరాల్లో సభా వేదిక
- పరిశీలించిన టీడీపీ నాయకులు

ఆళ్లగడ్డ, జనవరి 5: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 9వ తేదీన ఆళ్లగడ్డకు వస్తుండటంతో.. లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సభావేదికను 12 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం సభాస్థలిలో ఉన్న కంపచెట్లను తొలగించే కార్యక్రమం మొదలు పెట్టారు. ఈ సభా వేదిక స్థలాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ ఇన్‌చార్జిలు ఎన్ఎండీ ఫరూక్, గౌరు వెంకటరెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి, భూమా విఖ్యాత్‌రెడ్డి, బార్గవ్‌రామ్‌నాయుడు, రవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభా కర్‌చౌదరి, మాజీ మంత్రి అఖిలప్రియ, మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం పిలు స్తోంది రా అంటూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు పిలుపునకు యావత్ తెలుగు ప్రజానీకం ఆయన వెంట నడిచిందని, ఇపుడు అదే నినాదంతోనే సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్లాలని అన్నారు. ఈ మేరకు టీడీపీ కార్యా చరణ రూపొందించిందని అన్నారు. మాజీ సీఎం చంద్ర బాబును నంద్యాలలోనే అరెస్టు చేసినందుకు జిల్లా ప్రజలు వైసీపీ పాలనకు అంతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆళ్లగడ్డ నుంచే చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరిస్తారని అన్నారు. 25 సంవత్సరాల తరువాత ఆళ్లగడ్డలో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా టీడీపీ నాయకులు

మహిళపై అత్యాచార యత్నం

- పరారై మొక్కజొన్న చేనులో దాక్కున్న వైనం
- డ్రోన్ కెమెరాలతో వెతికిన పోలీసులు
- 9గంటల తర్వాత చిక్కిన నిందితుడు..?



నిందితుడి కోసం మొక్కజొన్న తోట వద్ద గాలిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, జనవరి 5: పొద్దున్నే మొక్కజొన్న పొలానికి పిట్టల కావలికి వెళ్లిన ఓ మహిళపై ఓ దుండగుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం ఆత్మకూరు పట్టణ శివార్లలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. పట్టణానికి చెందిన ఓ మహిళ తమ మొక్కజొన్న పంట వద్దకు ఉదయాన్నే వెళ్లింది. 9గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా అక్కడే కంది చేనులో మాటు వేసిన ఓ దుండగుడు ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. కేకలు వేస్తున్నా వదలకుండా వేధించారు. ఆమె అతన్ని తోసేసి పరుగులు తీసింది. అయితే అదే సమయంలో ఆ మహిళ బంధువు బైక్‌పై రావడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆత్మకూరు సీఐ నాగభూషణ్, ఎస్సైలు జీ కృష్ణమూర్తి, వెంకటనారాయణరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే దుండగుడు సమీపంలోని 15 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన మొక్కజొన్న తోటలోకి వెళ్లి దాక్కుతున్నాడు. ఆరు అడుగుల ఎత్తులో మొక్కజొన్న పైరు పెరగడంతో నిందితుడ్ని పట్టుకోవడం పోలీసులకు సమస్యగా మారింది. దీంతో వారు వెంటనే రెండు డ్రోన్ కెమెరాలను తెప్పించి నిందితుడి కోసం గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. అయినప్పటికీ పోలీసులు చేను చుట్టూ చేరి సాయంత్రం వరకు అక్కడే మకాం చేశారు. దీంతో ఎట్టకేలకు సాయంత్రం 6గంటల సమయంలో నిందితుడు మొక్కజొన్న చేనులో నుంచి బయటకు రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా మొక్కజొన్న చేనులోకి వెళ్లిన నిందితుడు అప్పటికే మద్యం సేవించడంతో సాయంత్రం వరకు దర్జాగా తోటలోనే నిద్రించినట్లు తెలిసింది. ఇదిలావుంటే పట్టుబడిన నిందితుడు ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. గతంలో కూడా ఇతను ఇదేవిధంగా ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

నిందితుల అరెస్టు

డోన్, జనవరి 5: డోన్ మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో ఎరుకలి ఖాదర్ హత్య కేసులో 13మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డోన్ రూరల్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని చిగురుమాన్ పేటకు చెందిన లక్ష్మీనారాయణ ఉంగరానిగుండ్ల గ్రామ రహదారిలో పొలం కొనుక్కొని, అక్కడే ఇల్లు కట్టుకున్నాడు. గత ఏడు నెలలుగా లక్ష్మీనారాయణ అక్కడే కుటుంబం నివసిస్తోంది. ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చిన్నమద్ది, ఆయన కుమారులకు లక్ష్మీనారాయణ కుటుంబంతో విభేదాలు ఉన్నాయి. డిసెంబరు 12న వైయస్ నగర్‌లో లక్ష్మీనారాయణ బంధువు సీతారాముడుపై చిన్నమద్ది కుమారుడు ఓబులేసు దాడి చేశాడు. దీనికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఈ కేసులో రాజీకి రావాలని లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులపై చిన్నమద్ది వత్తిడి తెచ్చాడు. వారు తిరస్కరించారు. ఈ కారణంగా కక్ష పెంచుకొని డిసెంబరు 31న రాత్రి న్యూఇయర్ వేడుకల్లో ఉండగా లక్ష్మీనారాయణ ఇంటిపై చిన్నమద్ది, ఆయన కుమారుడు ఓబులేసు, అనుచరులు దాడి చేశారు. కారు అద్దాలు ధ్వంసం చేశారు. డోన్‌లో నూతన సంవత్సర వేడుకల్లో ఉన్న లక్ష్మీనారాయణ కొడుకు ఖాదర్ ఈ విషయం తెలుసుకొని తన స్నేహితులతో కలసి గ్రామానికి వెళ్లగా వారిపై కూడ దాడి చేశారు. ఖాదర్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయనను డోన్ ఆస్పత్రికి, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. అప్పటికే ఖాదర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12మందిపై కేసు నమోదు చేశామని, తమ దర్యాప్తులో మాత్రం 14మంది దాడిలో పాల్గొన్నట్లు తెలిసిందని డీఎస్పీ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు హత్య కేసు నమోదు చేశామని, ఇందులో 13 మంది నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారని డీఎస్పీ వివరించారు. మరో నిందితుడు రామ్మోహన్ పరారీలో ఉన్నారని, అతడి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, శరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్యాపిలి, జనవరి 5: మండలంలోని ఊటకొండ గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో గంగరాజు(55) మృతి చెందాడు. రైతు పొలంలో గొర్రెలను మేపుతూ.. వాటికి నీరు తాపేందుకు బోరు దగ్గరకు వెళ్లాడు. అయితే బోరులో నీరు రాలేదు. ఫ్యూజ్ పోయిందేమోనని చూస్తుండగా ప్రమాదవశాత్తు గంగరాజు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

ఆర్‌బీకేల ద్వారా కందుల కొనుగోలు కేంద్రాలు


జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

నంద్యాల టౌన్, జనవరి 5: ఆర్‌బీకేల ద్వారా కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కందులను అమ్మేందుకు రైతులు తమ సమీపంలోని ఆర్‌బీకేలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కందులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చినప్పుడు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని అన్నారు. కందుల నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి తేమ శాతం 12 శాతం, మిశ్రమ పదార్థాలు 3 శాతం, ఇతర పంట గింజలు ఒక శాతం, పాక్షికంగా దెబ్బతిన్న గింజలు 3 శాతం, విరిగిపోయిన, విడిపోయిన గింజలు 3 శాతం, నులిపురుగు గింజలు 3 శాతం, పరిపక్వత, కుంగిపోయిన గింజలు 3 శాతంకు లోబడి ఉండాలని అన్నారు. రైతులు అమ్మిన పంటకు సంబంధించి డబ్బు వారి ఆధార్ నంబరుకు అనుసంధానమైన బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి కాటా వేసి లారీకి ఎక్కించే వరకు హమాలీ ఖర్చులను రైతులే భరించాలని తెలిపారు. గోనె సంచులు, రవాణా సౌకర్యాలు, గోదాముల దగ్గర హమాలీ ఖర్చులు మార్క్‌ఫెడ్ వారు ఏర్పాటు చేస్తారని అన్నారు. మార్కెట్ రేటును ఏ రోజుకారోజు ఆర్‌బీకేల వద్ద తెలియజేస్తామని వివరించారు.

ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలి

నంద్యాల క్రైం, జనవరి 5 : రానున్న సార్వత్రిక ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది తీరు తెన్నులపై దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా గత ఎన్నికల్లో నమోదై ట్రయల్ నడుస్తున్న కేసుల స్థితిగతులు, జిల్లాలో గుర్తించిన అతి సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలు, లైసెన్స్‌డ్ తుపాకులు, ఎన్‌బీడబ్ల్యూఎస్, గ్రామాలకు సంబంధించిన సమాచారం, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు తదితర వాటిపై సూచనలు చేశారు.

గుమ్మనూరు ఔట్..!



- ఆలూరు టికెట్‌పై తేల్చి చెప్పిన సీఎం జగన్
- బొజ్జమ్మకైనా ఇవ్వమని కోరిన మంత్రి జయరాం
- లిస్ట్ వస్తుంది.. చూసుకో..! అని చెప్పిన ముఖ్యమంత్రి
- ఆలూరుకు వినిపిస్తున్న హిమవర్షిణీరెడ్డి, విరుపాక్షి పేర్లు

కర్నూలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆలూరు బరిలోకి దిగకముందే మంత్రి గుమ్మనూరు జయరాం ఔట్ అయినట్లేనా..? తాజా రాజకీయ పరిణామాల రీత్యా అవుననే అనిపిస్తోంది. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బొజ్జమ్మతో కలసి మంత్రి జయరాం శుక్రవారం తాడేపల్లి ప్యాలెస్‌లో సీఎం జగన్‌ను కలిశారు. ఆలూరు టికెట్ తనకు కాకపోతే బొజ్జమ్మకు ఇవ్వాలని గుమ్మనూరు కోరారు. ఇందుకు సీఎం.. రెండు మూడు రోజుల్లో లిస్ట్ వస్తుంది, చూసుకోండని చెప్పడంతో నిరుత్సాహంగా వెనుదిరిగారు. దీంతో ఆలూరు వైసీపీ టికెట్ ఎవరికి..? అనే సస్పెన్షన్ కొనసాగుతున్నది. దివంగత మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి కుమార్తె హిమవర్షిణీరెడ్డి, చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షి, తెర్నేకల్లు సురేంద్రరెడ్డి, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మంత్రి జయరాం ఎంపీగా పోటీ చేస్తారా..? మరో దారి ఎంచుకుంటారా..? అనేది జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

మంత్రి గుమ్మనూరు దారెటు?

మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు ఆలూరు టికెట్ ఇచ్చేది లేదని సీఎం జగన్ తేల్చి చెప్పారు. ఈ పరిస్థితిలో ఆయన ఏ దారి చూసుకుంటారు? అనే ప్రశ్న తలెత్తుతోంది. శుక్రవారం మంత్రి జయరాం, వైసీపీ నాయకురాలు బొజ్జమ్మ సీఎం జగన్‌ను కలిశారు. అధిష్ఠానం పిలుపు మేరకు విజయవాడకు చేరుకున్న వీరిద్దరూ సాయంత్రం 4.45 గంటల సమయంలో తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లారు. సుమారు 15 నిమిషాలు సీఎం జగన్, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో ఓఎస్‌డీ ధనుంజయరెడ్డిలతో భేటీ అయ్యారు. ఆలూరు టికెట్ ఈ ఒక్కసారి తనకే ఇవ్వాలని మంత్రి గుమ్మనూరు జయరాం కోరారు. దానికి సీఎం.. పోటీలో ఉండాలనుకుంటే కర్నూలు ఎంపీగా వెళ్లు అని తేల్చి చెప్పినట్లు సమాచారం. తనకు కాకపోతే కప్పట్రాళ్ల బొజ్జమ్మకు అయినా టికెట్ ఇస్తే గెలిపించుకువస్తానని జయరాం అంటే.. రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల లిస్టు వస్తుంది అందులో చూసుకోమని జగన్ కర్కశంగా చెప్పేశారని సమాచారం. దీంతో చేసేది లేక తాడేపల్లి ప్యాలెస్ నుంచి జయరాం బయటపడ్డారు. జగన్ సూచన మేరకు ఎంపీగా పోటీ చేయడమా..? ఆలూరు బరిలో ఉండాలనుకుంటే మరో మార్గం ఎంచుకోవడమా? అనేది జయరాం వర్గీయులను వెంటాడుతున్న ప్రశ్నలు. ఎలాగైనా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని టికెట్ కోసం మంత్రి జయరాం రాజకీయ ఎత్తులకు పైఎత్తులు వేశారు. కర్ణాటక నుంచి కూడా పావులు కదిపారు. చివరకు సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ఐప్యాక్ టీం ఆడిన రాజకీయ చదరంగంలో జయరాం ఔట్ కాకతప్పలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. చిప్పగిరి నుంచి టీడీపీ జడ్పీటీసీగా గెలిచిన గుమ్మనూరు జయరాం 2009లో ఆలూరు నుంచి ప్రజారాజ్యం పార్టీ టికెట్‌పై తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత వైసీపీలో చేరి 2014, 2019లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం కార్మిక శాఖ మంత్రిగా ఉన్న జయరాం వర్గీయులు జగన్ తాజా నిర్ణయంతో రగిలిపోతున్నారు.

ఆలూరు అభ్యర్థిపై తొలగని సస్పెన్షన్!



బొజ్జమ్మ

గత ఏడాది జూన్‌లో ఆస్పరి మాజీ జడ్పీటీసీ కప్పట్రాళ్ల బొజ్జమ్మ టీడీపీని వీడి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఆ సందర్భంగా బొజ్జమ్మ ఆలూరు చూసుకుంటుంది.. నీవు కర్నూలు పార్లమెంట్ చూసుకో..! అని వేదికపైనే మంత్రి గుమ్మనూరు జయరాంకు సీఎం జగన్ సూచించారు. శుక్రవారం మంత్రి జయరాం ఆమె పేరు ప్రతిపాదించినా జగన్ స్పష్టత ఇవ్వకపోవడంతో ఆలూరు అభ్యర్థి ఎవరు..? అనే ప్రశ్న తలెత్తుతోంది. వాల్మీకి సామాజికవర్గం వారికే టికెట్ ఇవ్వాలని జగన్ అనుకుంటే బొజ్జమ్మ, విరుపాక్షి ఇద్దరిలో ఒకరికి ఖాయమని అంటున్నారు. అలా కాకుండా ఓసీ సామాజికవర్గం వ్యక్తికి ఇవ్వాలనుకుంటే అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్న పాటిల్ హిమవర్షణి రెడ్డి, తెర్నేకల్లు సురేంద్రరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. హిమవర్షణి అమ్మమ్మ, భర్త కడప జిల్లాకు చెందిన వారు. వారికి వైఎస్ కుటుంబంతో బంధుత్వం ఉంది. అమెరికాకు వైఎస్ కుటుంబ సభ్యులు ఎవరు వెళ్లినా హిమవర్షిణీరెడ్డి ఇంట్లోనే ఉంటారని అంటున్నారు. దీంతో ఆమెకే ఆలూరు టికెట్ ఖాయం అంటున్నారు. అయితే వాల్మీకుల్లో వ్యతిరేకత రాకుండా బొజ్జమ్మ, విరుపాక్షిలలో ఒకరికి ఇవ్వవచ్చు అని కూడా అంటున్నారు. మరో పక్క కురవ సామాజిక వర్గానికి చెందిన బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ వైసీపీ టికెట్ కోసం కర్ణాటక, ఢిల్లీ పెద్దల ద్వారా చక్రం తిప్పుతున్నట్లు సమాచారం.

మా హయాంలోనే పాణ్యం అభివృద్ధి

కల్లూరు, జనవరి 5: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే పాణ్యం నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందిందని ఆపార్టీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత స్పష్టం చేశారు. శుక్రవారం తన స్వగృహంలో ఆమె మాట్లాడారు. చెన్నమ్మ సర్కిల్‌లో గురువారం పాణ్యం సామాజిక సాధికార సభలో వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్న ఎమ్మెల్యే తీరు హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, మహిళలు, రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వాన్ని మార్చేందుకు ఒక్క అవకాశం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పనులు చేయడం మానేశారని, 15 రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు, శానిటేషన్ సిబ్బంది, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు, నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. పంచాయతీల్లో నిధులను లాగేసుకున్నారని వైసీపీ సర్పంచులే కండువాలు కింద పడేస్తున్నారని గుర్తు చేశారు. పాణ్యంలో రూ.800 కోట్లతో అభివృద్ధి చేశానన్న ఎమ్మెల్యే కాటసాని 16 వార్డులకా, నియోజకవర్గానికా అన్న విషయం స్పష్టం చేయలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో రూ.800 కోట్లు ఖర్చు చేసి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు మౌలిక వసతులు కల్పించామని గౌరు చరిత తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కల్లూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎస్వీ రామకృష్ణ, పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జె. గంగాధర్‌గౌడ్, కల్లూరు పదో క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ మాదన్న, మాదేష్ పాల్గొన్నారు.

పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన ఆటో

నంద్యాల క్రైం, జనవరి 5: నంద్యాల-కర్నూలు బైపాస్ రోడ్డు సమీపంలోని కుందూ నది బ్రిడ్జిపై ఆటో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల నుంచి ముగ్గురు ప్రయాణికులతో ఆటో పాణ్యం వైపు వెళ్తోంది. కుందూ నంది బ్రిడ్జి వద్ద కారును ఆటో డ్రైవర్ దాస్ ఓవర్ టేక్ చేయబోయాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో డ్రైవర్ దాసు (26)తోపాటు అందులో ప్రయాణిస్తున్న మరో మహిళ (28) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ దాస్ శ్రీశైలం సమీపంలోని సున్నిపెంట ప్రాంతానికి చెందినవాడుగా తెలిసింది. మృతి చెందిన మహిళ వివరాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసుకొని మృతుల వివరాలను సేకరిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

బీసీలను అణగదొక్కిన జగన్: సోమిశెట్టి



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్), జనవరి 5: జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీలను పూర్తిగా అణచివేశారని సోమిశెట్టి వెంకటేశ్వర్లు మండిపడ్డారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రామాంజనేయులుతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ కూడా ఓటు బ్యాంక్ గానే చూసిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సామాజికాభివృద్ధికి కృషి చేశారని, జడ్పీ, మున్సిపల్ చెర్మన్లతో పాటు స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులుగా బీసీలకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. టీడీపీ అంటేనే బీసీల పార్టీగా గుర్తింపు తెచ్చారన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి



వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కోడుమూరు(రూరల్), జనవరి 5: గ్రామాలలో నిర్వహించే వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా ఇమ్యూనై జేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని లద్దగిరిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్యాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కంటి, సాధారణ వైద్య పరీక్షలు, మందుల పంపిణీని పరిశీలించారు. వీరి వెంట ఎంపీపీ రూతమ్మ, తహసీల్దార్ జయన్న ఎంపీడీవో చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్, వైద్యబృందం ఉన్నారు.

నేడు నూతన దుకాణాలకు లాటరీ



దరఖాస్తులను పరిశీలిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 5: స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద నూతనంగా నిర్మించిన దుకాణాలకు శనివారం టెండర్లు నిర్వహించనున్నట్లు మేనేజర్ చిన్నరాముడు తెలిపారు. శుక్రవారం ఆయన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 12 దుకాణాలకు 41 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో రెండు దుకాణాలు ఆప్కో చేనేత వస్త్రాలయం, మరోకటి మత్స్య వ్యాపారానికి కేటాయించామని, మిగిలిన వాటిని లాటరీ పద్ధతిన కేటాయిస్తామని ఆయన తెలిపారు. ఏడాది కాలపరిమితి ఉండే ఈ దుకాణానికి నెలకు రూ.8వేల అద్దె చెల్లించాలని, లాటరీలో పాల్గొనే నిర్వా హకులు రూ.లక్ష గుడ్‌విల్ చెల్లించాలని అన్నారు. ఏదైనా బ్రాండ్/ఫ్రాంచేయిస్ ఉన్న వారికి ప్రత్యేకంగా దుకాణం కేటాయిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 11 గంటలకు పాత కౌన్సిల్ హాలులో లాటరీ ఉంటుందని ఆయన తెలిపారు.

15వ తేదీ నాటికి పూర్తి చేయండి: జేసీ

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 5: ఎండీయూ వాహనదారులు, వలంటీర్లు సమన్వయంతో పని చేసి ప్రతి నెలా 15వ తేదీ నాటికి రేషన్ పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇచ్చే టేక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి నెలా 1, 2 తేదీల్లో అంగన్‌వాడీ సెంటర్లకు చేరుకున్న కిట్లను తక్షణమే పంపిణీ చేయాలని అన్నారు. రేషన్ డీలర్లు ప్రతి నెల 30వ తేదీన ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ హ్యాండ్ ఓవర్ చేసుకుని నిర్ణీత గడువు లోపల ప్రజలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో రాగులు స్టాక్ ఉన్నాయని, బియ్యంతో పాటు రాగులను కూడా పంపిణీ అయ్యేలా చూడాలని అన్నారు. రాగులు వినియోగంపై పౌరసరఫరాల శాఖ వారు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో పౌరసరఫరాల అధికారి కేవీఎస్ఎం ప్రసాద్, సివిల్ సప్లయ్ డీఎం షర్మిళ, సివిల్ సప్లైయిస్ డీటీలు ఎండీయూ వాహనాల ప్రతినిధులు, రేషన్‌షాపు డీలర్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

కోట్ల రాఘవేంద్ర రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

గూడూరు, జనవరి 5: టీడీపీ యువనేత కోట్ల రాఘవేంద్ర రెడ్డిని గూడూరు టీడీపీ నాయకులు కలిశారు. శుక్రవారం కోట్ల స్వగృహంలో రాఘవేంద్ర రెడ్డిని టీడీపీ సీనియర్ టీడీపీ నాయకుడు రాజా రెడ్డి, కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ ఆధ్వర్యం లో పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు

కర్నూలు(కల్చరల్), జనవరి 5: మున్సిపల్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఐర్లండ్ దేశానికి చెందిన మహిళ పౌలా డఫ్ఫీ ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. శుక్రవారం నగర శివారు జోహరాపురంలోని మున్సిపల్ పాఠశాల్లో జరిగిన ఈకార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ క్రైప పద్మలతారెడ్డి, శౌర్య హోండా షోరూమ్ అధినేత విశ్వమోహన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మలతారెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఐర్లండ్ నుంచి పౌలా డఫ్ఫీ భారత్‌కు విచ్చేశారని, విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇంటికి అతిథిగా విచ్చేసిన ఆమె తన సామాజిక సేవల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేయడం అభినందనీ యమన్నారు.

నేటి నుంచి పోలీసు క్రీడలు

కర్నూలు, జనవరి 5: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు పోలీసు క్రీడా పోటీలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బందికి ఈ పోటీలు నిర్వహిస్తారు. 100, 200, 400, 800, 1500 మీటర్లలో పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావ లిన్‌త్రో, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల్లో పోటీలు జరుగుతాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

మీటింగ్‌కు రాకుంటే పింఛన్ కట్

సి.బెళగల్, జనవరి 5: మీటింగ్ రాకుంటే పింఛన్ కట్ చేస్తామని వలంటీర్లు, వెలుగు సిబ్బంది పొదుపు మహిళలకు సమాచారం అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే, జిల్లా అధికారులు సి.బెళగల్‌కు వస్తారని, కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తారని, లబ్ధిదారులు, పొదుపు మహిళలు హాజరుకావాలని అన్నారు. సమావేశానికి రాకపోతే పింఛన్ కట్ అవుతుందని అన్నారు. అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో సమావేశం జరుగుందని తెలిపారు. దీంతో మండలంలోని పింఛన్‌దారులు, పొ దుపు మహిళలు వచ్చారు. అయితే సమావేశానికి ఎమ్మెల్యేగాని, అధికారులు గాని రాలేదు. దీంతో లబ్ధిదారులు, పొదుపు మహిళలు ఉసూరుమంటూ వెళ్లిపోయారు. కొంతమందికి మాత్రమే ఎంపీపీ బొంతల మునెప్ప పింఛన్లు పంపిణీ చేశారు.

చంద్రబాబుతోనే మహిళలకు భరోసా

» మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, జనవరి 5: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో మహిళలకు భరోసా ఉంటుందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం మండలంలోని శకునాల గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మౌళీశ్వరరెడ్డి, హరి, సుబ్బయ్య, మోహన్‌రెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సుధాకరరావు, మహబూబ్‌బాష, నాగిరెడ్డి, ప్రభాకర్, ఖాజామియ పాల్గొన్నారు.



శకునాలలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గౌరు చరిత

గూడూరు: చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దండు సుందరరాజు అన్నారు. శుక్రవారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గజేంద్ర గోపాల్ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఇంటింటికి వెళ్ళి టీడీపీ మ్యానిఫెస్టోను వివరిస్తుంటే ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాగప్ప యాదవ్, గిడ్డయ్య, చిలక శ్రీను, ఎల్లయ్య, శాంతరాజు పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): బాబుతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కర్నూలు రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జి వై.రామేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండలంలోని పలు బూత్‌ల పరిధిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ మ్యానిఫెస్టోను ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నా మన్నారు. జగన్మోహన్‌రెడ్డి అరాచకాలతో విసిగిపోయామని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. పన్నుల భారం, నిత్యవసరాల ధరల పెరుగుదల, అభి వృద్ధి లేక రాష్ట్రం దివాల తిసే స్థితికి చేరుకుందని ప్రజలు గగ్గోలు పెడుతు న్నారని వివరించారు. కార్య క్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు సీబీ. ఆదిత్యా రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్ పాల్గొన్నారు.



గూడూరులో..



కర్నూలు రూరల్ మండలంలో..

టీడీపీ హయాంలోనే దళితులకు న్యాయం

» కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 5: తెలుగుదేశం హయాంలోనే దళితులకు న్యాయం జరిగిందని పార్టీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం 'దళిత బిడ్డ మేలుకో' కార్యక్రమం పేరుతో టీడీపీ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మౌర్యాఇన్‌లో టీడీపీ సీనియర్ దళిత నాయకులు, అనుబంధ సంఘాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ వాడవాడలా తిరిగి టీడీపీ హయాంలో దళితుల అభివృద్ధి కోసం ఏం చేశామన్నది వివరిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో సీని యర్ నాయకులు బోల్లెదుల్ల రామకృష్ణ, దేవా, సుంకన్న, గున్నా మార్కు, సురేంద్ర, రాజ్‌కుమార్, పాల్ రాజు, ప్రసాద్, ఈశ్వర్, కిరణ్, అజయ్, భాస్కర్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కర్నూలు(హాస్పిటల్), జనవరి 5: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల టీబీ వార్డులో సీఐటీయూ నాయకుడు వి.సూర్యనారాయణ 35వ వర్ధంతి సందర్భంగా రోగులకు సూపరింటెండెంట్ వి.వెంకట రంగారెడ్డి పండ్లను పంపిణీ చేశారు. ఫల్మనాలజి హెచ్‌వోడీ శ్రీకాంత్, ట్రస్టు కార్యదర్శి జి.రామకృష్ణ, కోశాధికారి సాయిబాబా, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన



సోది చెప్పించుకుంటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

గూడూరు, జనవరి 5: గూడూరు పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె 25వ రోజుకు చేరుకుంది. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సోదమ్మతో సోది చెప్పించుకుంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే మోహన్ మా ట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే వైసీపీ ప్రభు త్వానికి భవిష్యత్తు ఉండదని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయరాలు ఇందుమతి, అరుణ, రాజేశ్వరి, అనంతమ్మ, రత్నమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

అనధికారిక విధులు

» రెచ్చిపోయి ప్రవర్తిస్తున్న ఓ చిరుద్యోగి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 5: పంచాయతీరాజ్ శాఖలోని ఓ డివిజన్‌లో చిరుద్యోగి హల్‌చల్ చేస్తున్నారు. అతనికి అదే సామాజిక వర్గానికి చెందిన ఓ అధికారి అండదండలు ఉండటంతో ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా చెలామణి అవుతున్నారు. అనధికారికంగా డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేయాల్సిన ఓ ఉద్యోగి పంచాయతీరాజ్ శాఖలోని ఓ డివిజన్‌లో ఎలాంటి డిప్యుటేషన్ లేకుండా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రధానంగా కార్యాలయంలో ఉండే ఉద్యోగులు విధులు నిర్వహించడానికి ఆఫీస్ ఆర్డరు ఇస్తారు. అయితే ఈ ఉద్యోగి ఇక్కడ పని చేయడానికి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో ఆఫీస్ ఆర్డర్‌లో పేరు లేదు. దీంతోపాటు ఎలాంటి పనులు కేటాయించలేదు. అయితే కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్లకు సంబంధించి ఇంక్రిమెంట్లు, జీతాలు చూడాలని ఓ సీనియర్ అసిస్టెంట్‌కు ఆఫీస్ ఆర్డర్ ఇవ్వగా ఉద్యోగి చేయాల్సిన పనులన్నీ సదరు చిరుద్యోగి చేస్తున్నాడు. ఇటీవల ఓ ఏఈ తన ఇంక్రిమెంటుకు సంబంధించి సర్వీసు రిజిస్టర్ తీసుకుని ఆ ఉద్యోగి వద్దకు వెళితే ఇష్టానుసారంగా మాట్లాడారని సమాచారం. ఇలా ఏఈలనే కాదు తన స్థాయి ఉద్యోగులతోపాటు పై స్థాయి ఉద్యోగులను కూడా లెక్కచేయడం లేదని తెలుస్తోంది. ఈ చిరుద్యోగి జిల్లా పరిషత్‌లో పని చేస్తున్న ఓ అధికారి సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఎవరూ ఏమిచేయలేని పరిస్థితి నెలకొంది. ఏమన్న అందామంటే ఆ కీలక అధికారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఉద్యోగులు భయపడుతున్నారు.

జీతాల బిల్లులు చేయడానికే..

ఉద్యోగి జీతాల బిల్లులు చేయడానికే వస్తుంటారు. మిగతా రోజుల్లో జిల్లా పరిషత్‌లోనే విధులు నిర్వహిస్తుంటారు. ఏదైనా కంప్యూటర్‌కు సంబంధించి పనులు ఉంటే పిలిపించుకుంటాం. గతంలో ఇక్కడే చేసిన అనుభవం ఉండటంతో అతనిని ఉపయోగించుకుంటున్నాం.

- రామకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పంచాయతీరాజ్ శాఖ

కొనసాగుతున్న క్లాప్ డ్రైవర్ల సమ్మె



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

కర్నూలు(కల్చరల్), జనవరి 5: కర్నూలు నగరపాలక సంస్థలోని క్లాప్ డ్రైవర్ల సమ్మె శుక్రవారం 20వ రోజుకు చేరుకుంది. క్లాప్ డ్రైవర్లు మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఓల్డ్‌సిటీ సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు పి. పుల్లారెడ్డి, సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్ నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ 20 రోజులుగా క్లాప్ డ్రైవర్లు సమ్మె చేస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు.

ఎన్నికల కోసం ప్రజాధనం వృథా

కర్నూలు(న్యూసిటీ), జనవరి 5: ఎన్నికలు వచ్చినప్పుడల్లా అధికారులు అవసరంలేని అభివృద్ధి పనులు చేస్తూ అధికారులు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి విమర్శించారు. శుక్రవారం అశోక్‌నగర్, రామలింగేశ్వర్ నగర్‌లో అనవ సరంగా చేస్తున్న పనులను సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు వచ్చాయంటే చాలు రోడ్లు వేయడం, ఫుట్‌పాత్‌లు కట్టడం, బాగున్న మురుగు కాలువలను కూల్చేయడం వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తూ ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.నౌషద్, శ్రీనివాసులు, షమీవుల్లా, ఇమ్రాన్, మురళి పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 5: నగరంలోని జిల్లా పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సర్వీసు, ఫ్యామిలి పెన్షనర్లకు 2024 సంవత్సరానికి లైఫ్ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ. సుబ్రహ్మణ్యం, టి.శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీ.క్యాంపులోని సబ్‌ట్రెజరీ కార్యాలయం వెనుక సీ/సీ-3 కార్యాలయంలో సంప్రందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(అర్బన్), జనవరి 5: ఓర్వకలు ఎస్సీ హస్టల్ వార్డెన్, వాచ్‌మెన్ నిర్లక్ష్యం వల్లే తూర్పాటి సురేందర్ అనే విద్యార్థి రోడ్డు ప్రమాదానికి గురయ్యారని బేడ, బుడగ, జంగం సంఘం రాష్ట్ర నాయకుడు తూర్పాటి మరోహర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయపడిన తూర్పాటి సురేందర్ కర్నూలు పెద్దాసుత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతడికి మెరుగైన వైద్యం అందించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో తాటి కొండ నారాయణ, తూర్పాటి వెంకటేష్, పత్తిరి వెంకటేష్ పాల్గొన్నారు.

నేపాల్ మహిళ ఆత్మహత్య

కర్నూలు, జనవరి 5: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బంగారుపేటలో నివాసముంటున్న నేపాల్ మహిళ మన్రూప(27) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మన్రూప, ఆమె భర్త పూర్ణబహదూర్ ఆర్థిక సమస్యలతో నేపాల్‌ను వదిలేసి కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు వచ్చారు. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. ఆర్థిక సమ స్యలతో కొన్ని గొడవలు జరిగాయి. శుక్రవారం మధ్యాహ్నం కూడా గొడవ జరగగా పూర్ణబహాదూర్ హోటల్‌కు వెళ్లిపోయాడు. తర్వాత కొద్దిసే పటికి మన్రూప ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించి ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 16 కేసులు

కర్నూలు, జనవరి 5: నగర శివారులో సుంకేసుల రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మంది ద్విచక్ర వాహనదారులు, ఒక ఆటో డ్రైవర్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వీరిని అదుపులోకి తీసుకుని వాహనాలు సీజ్ చేశారు. వీరందరినీ నేడు కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బర్రెకు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

గూడూరు, జనవరి 5: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం గూడూరులో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మెహన్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలను పరిష్కరించాలని వినూత్నంగా బర్రెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు శాంతన్న, దానమన్న, లక్షీదేవి, గ్రేసమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ, జనవరి 5: ఈ నెల 8,19,10 తేదీల్లో జరిగే ఏపీ రైతు సంఘం 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాజమండ్రిలో జరిగే మహాసభలకు ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, కార్యదర్శి అతుల్‌కుమార్ హాజరవుతున్నారని, రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి

సి.బెళగల్, జనవరి 5: నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని డీఈ వాసుదేవుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండలంలోని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథ మిక, ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణాలను వేగవంతం చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. ఈసమావేశంలో ఏఈ గోనె నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 5: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.కేతు శ్రీనివాసమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక వెంకాయపల్లె సమీపంలోని రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో హెల్త్ క్లబ్ స్వాస్థ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో రక్తదాన శిబిరం, బ్లడ్ గ్రూప్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందదర్భంగా కళాశాల విద్యార్థినులు రక్తదానం చేశారు. వారిని కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ జే ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సి. అహల్య, ఆర్.దీప్తి, వి.ప్రేమ మన్వి పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ముగిసిన దేవర

కోడుమూరు(రూరల్), జనవరి 5: మండలంలోని గోరంట్ల మజరా కొత్తపల్లిలో గ్రామ దేవతల దేవర శుక్రవారం ముగిసింది. గ్రామ దేవతలు రాములమ్మ, వాసుదేవమ్మలకు భక్తులు పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాలకు చేరి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, చీరసారె సమర్పించారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వాల్మీకి యువగర్జనను జయప్రదం చేయండి

ఓర్వకల్లు, జనవరి 5: కర్నూలు నగరంలో ఈ నెల 20న చేపట్టే చలో వాల్మీకి యువ గర్జనను జయప్రదం చేయాలని సంఘం నాయకుడు వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కొమరోలు, ఉశేనాపురం, పూడిచెర్ల గ్రామాలలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శేషు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, వాల్మీకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

కర్నూలు(కల్చరల్), జనవరి 5: లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్టు ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రముఖ ఆడిటర్ బుచ్చన్న దాతృత్వంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం నగర శివారు కల్లూరులోని ఆదిత్య పాఠశాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కల్లూరు ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం వారు కూడా కలిసి వికలాంగులకు ఆర్థిక సాయం అందజేశారు. రామరాజ్, రత్న ప్రసాద్, వెంకటేశ్వర్లు, బీవీ రమణగౌడ్, పీవీ రాజ్‌కుమార్, ఎస్‌కే బాషా, భవానీ పాల్గొన్నారు.

ఘనంగా రాజశ్యామల యాగం



యాగంలో పాల్గొన్న కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

కోడుమూరు, జనవరి 5: స్థానిక ధర్మపురి ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం విజయ రాజాశ్యాలాంబదేవి మహాయాగం కన్నులు పండువగా కొనసాగింది. ఈ యాగంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది దంపతులు పాల్గొన్నారు. కోట్ల హరిచక్రపాణిరెడ్డి, కోట్ల భానుశ్రీ దంపతులు, పత్తికొండ శ్రీదేవి, కోట్ల రామవేంద్రరెడ్డి, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోట్ల కవితమ్మ మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ పాల్గొన్నారు.

అడిషనల్ డీఎంఈకి అభినందనలు



కేక్ కట్ చేస్తున్న అడిషనల్ డీఎంఈ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 5: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి స్పెషల్ అడిషనల్ డీఎంఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనకు ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆసుపత్రి ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఆఫీసు సూపరింటెండెంట్ కుమారస్వామి అభినందనలు తెలిపారు.

● అడిషినల్ డీఎంఈగా పదోన్నతి పొందిన వెంకటరంగారెడ్డికి మెడి కల్ ఎంప్లాయీస్ యూనియన్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.బాలు నాయక్, ఎస్.ఖాజామొహిద్దీన్, కోశాధికారి కె.సురేష్, సభ్యులు లింగస్వామి, సి.రమేష్, శేషిరెడ్డి, కె.సుబ్బ య్య, వి.రాజు, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

వ్యాయామం చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 5: జర్నలిస్టులు ప్రతి రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్ అధినేత పుల్యాల చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఫొటో వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించనున్న జర్నలిస్టుల ఉచిత వైద్యశిబిరం కరపత్రాలను డాక్టర్ చంద్ర శేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గంటల తరబడి ఒకే చోట కూర్చొని పని చేయడం, శారీరక శ్రమ లేకపోవడం మన జీవనశైలి మార్పుల వల్ల ఆటంకాలు రావచ్చునని, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుకు పరుచుకునేందుకు ఆహారపు అలవాట్లు, జీవన విధానాన్ని మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రవి, ప్రసాద్, షరీఫ్, దినకర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

డిగ్రీలో పరీక్షల్లో 18 మంది డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 5: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 1, 5 సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం 18 మంది డీబార్ అయినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

సదరం వద్ద వివాదం

కర్నూలు(హాస్పిటల్), జనవరి 5: అప్తామాలజి సదరం సర్టిఫికెట్ కోసం రూ.30వేలు చెల్లించామని, అయినా సర్టిఫికెట్ ఇవ్వడం లేదంటూ కర్నూలు ప్రభుత్వాసుపత్రి సదరం విభాగం వద్ద కొందరు గొడవకు దిగారు. సదరం సర్టిఫికెట్ కోసం ఇక్కడ పని చేసే ఓ వ్యక్తికి రూ.30వేల డబ్బులు ఇచ్చామని కర్నూలుకు చెందిన ఓ మహిళకు సదరంలో ఉండే ఓ వ్యక్తితో వాదనకు దిగింది. గొడవ విషయం ఆసుపత్రి అధికారుల దృష్టికి వెళ్లింది. ఈవిషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డిని వివరణ కోరగా.. ఇది మాకు సంబంధం లేదని, తమ దగ్గర ఆ ఇద్దరు పని చేయడం లేదని, సదరంలో రెగ్యులర్ ఉద్యోగులను నియమించామని చెప్పారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ప్రభుత్వం మొండివైఖరి వీడాలి



ఎమ్మిగనూరులో ఉరితాళ్లు వేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఎమ్మిగనూరు, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని వీడి తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రసాద్, రంగన్న, రాముడులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 11వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శిబిరం దగ్గర కార్మికులు మెడలకు ఉరితాళ్లు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 21 డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వీరేష్, విజేంద్ర, ఎల్లప్ప, కౌవుల్‌రాజు, లక్ష్మణ్, నాగప్ప, అల్లా బకాష్, ప్రతాప్, ఫకీర్, ఉరుకుందు, కేశన్న, నల్లారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు ఆదోని పట్టణంలో శుక్రవారం రోడ్డుపై మోకాళ్ళ మీద కూర్చుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు మాట్లాడుతూ సమాన పనికి - సమాన వేతనం ఇవ్వాల్సిన ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని విమర్శించారు. ఏఐటీయూసీ నాయకులు ఓబీ నాగరాజు, కల్లుబావి రాజు, షేక్షావలి, మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్‌బాబు, జయరాజ్, లక్ష్మన్న, శేఖర్, ఎల్లప్ప, సుశీల, నాగమ్మ, ఆదిలక్ష్మి, ఐసీ లక్ష్మి పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్లు వద్దు..



విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఆస్పరి, జనవరి 5: వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించడాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక సబ్ స్టేషన్ ముందు సీపీఐ రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకుడు నాగేంద్రయ్య, మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ రైతులకు శాపంగా మారిన మీటర్లను రద్దు చేసి, ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయ, ఉరుకుందప్ప, కృష్ణమూర్తి, రంగన్న, రాముడు పాల్గొన్నారు.

కార్మిక చైతన్య పోస్టర్లు విడుదల

పత్తికొండ, జనవరి 5: వైసీపీ పాలనలో కార్మిక వర్గాలు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రజలకు వివరించేందుకు టీఎన్‌టీయూసీ చేపట్టే కార్మిక చైతన్య యాత్ర పోస్టర్లను శుక్రవారం టీడీపీ నియోజవకవర్గ ఇంచార్జీ కేఈ శ్యాంబాబు విడుదల చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్రకార్యదర్శి నరసింహులు యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ శనివారం నుంచి టెక్కలిలో ఈయాత్ర ప్రారంభమవుతుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు నేతృత్వంలో రాష్ట్రమంతా పర్యటించి కుప్పంలో ముగుస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అందిన పథకాలు, వారికి కల్పించిన అవకాశాలను వివరిస్తూ, ప్రస్తుత జగన్ పాలనలో జరుగుతున్న అన్యాయాలను కార్మికులకు తెలిజేస్తారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్‌చౌదరి, బత్తిన అరుణ్‌కుమార్, మూలింటి లక్ష్మీనారాయణ, దూదేకొండ పరమేశ్, ఈశ్వరప్ప, జయరాముడు, విజయమోహన్‌రెడ్డి, చక్రినాయక్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష తనిఖీ

వెల్దుర్తి, జనవరి 5: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.మురళీధర్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రులకు తరలించి వైద్యం అందించాలన్నారు. అంతకుముందు నంద్యాల జిల్లా ప్యాపిలిలో సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ డీఈఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ సుంకన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

కౌతాళం, జనవరి 5: మండలంలోని బదినేహాల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు డాడ్జిబాల్ పోటీలలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం హరినాథరావు, వ్యాయమ ఉపాధ్యాయుడు నరసింహరాజులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మారెప్ప, షేక్షావలి డాడ్జిబాల్ పోటీలలో ఇటీవల ప్రతిభ కనబరిచినందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేది వరకు హర్యానా రాష్ట్రంలోని గోహనాలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలలో వారు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు.

పెన్షన్లు ఇవ్వండి

ఆలూరు, జనవరి 5: పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు 5వ తేదీ గడచినా పెన్షన్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని పెన్షనర్ల సంఘం ఆలూరు తాలుకా అధ్యక్ష, సహాయ కార్యదర్శులు రామకృష్ణ రెడ్డి, కె గోవిందప్ప అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులందరికీ జీతాలు ఇచ్చినా, పెన్షనర్లకు మాత్రం పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే పెన్షన్ల మంజూరులో అలస్యం లేకుండా ప్రతి నెల ఒకటిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పెండింగ్ బకాయిలపై ఉద్యమించాలి

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 5: ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలపై ఉద్యమించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల వద్ద ఎస్టీయూ వజ్రోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీలలో కర్నూలులో జరిగే ఎస్టీయూ వజ్రోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్సీ బకాయిలు చెల్లించకుండా నిరక్ష్యం చేస్తుందన్నారు. మదిరే, బల్లేకల్లు గ్రామాల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మొక్కలు నాటారు. నాయకులు వీరచంద్ర యాదవ్, రత్నం, సత్తెన్న, గోపాల్, సుధాకర్‌బాబు, ఈరన్నగౌడ్ పాల్గొన్నారు.

సమ్మె విరమించేది లేదు

▸ ప్రభుత్వ నోటీసులను దహనం చేసిన అంగన్‌వాడీలు

ఆదోని, జనవరి 5: అంగన్‌వాడీలకు జీతాలు పెంచేంతవరకు సమ్మెను విరమించేది లేదని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు తేల్చి చెప్పారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను దహనం చేసి, భీమాస్ సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, వరలక్ష్మి, సరోజ, జానికిలు మాట్లాడుతూ 25వ రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చర్చలతో కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్ర మంలో నాయకులు వీరేష్, తిప్పన్న, అంగన్‌వాడీ వర్కర్లు పద్మ, రేణుక, సరోజ, సోమక్క, శారద, ఈరమ్మ పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని హలహర్వి సెక్టార్‌లోని పొణకలదిన్నె, సోమలగూడూరు గ్రామాల్లోని అంగన్‌వాడీలు అధికారులు నోటీసులు పంపించారు. పొణకలదిన్నెలో అధికారులు పంపిన నోటీసును అంగన్‌వాడీ కేంద్రానికి అతికించి నిరసన తెలిపారు. సోమలగూడూరులో నోటీసులను చింపి నిరసన వ్యక్తం చేశారు.

వెల్దుర్తి: పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసనలు శుక్రవారం 25వ రోజుకు చేరుకున్నాయి. వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల అంగన్‌వాడీలు పచ్చగడ్డి తింటూ వినూత్న నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వెల్దుర్తి, క్రిష్ణగిరి మండల కార్యదర్శులు ఈదమ్మ, చాందినీ పాల్గొన్నారు.

దేవనకొండ: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమ బాట అగదని అంగన్‌వాడీ టీచర్లు సీపీఐ,సీపీఎం నాయకులు అన్నారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయల ఎదుట ధర్నా చేసి దేవనకొండలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ ఆవరణంలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ మద్దిలేటి శెట్టి, సీపీఎం వీరశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, లతా, రసూల్‌బీ, మబునీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఆదోనిలో ప్రభుత్వ నోటీసులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



వెల్దుర్తిలో పచ్చగడ్డి తింటూ నిరసన



నందవరం మండలం: పొణకలదిన్నెలో..

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న తిక్కారెడ్డి

మంత్రాలయం, జనవరి 5: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో శుక్రవారం నవ్యాంధ్ర ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమరేశ ఆధ్యక్షతన నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డి, టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డి, గురురెడ్డి భీమిరెడ్డి, విశ్వనాథరెడ్డి, చావిడి వెంకటేష్, అమరనాథరెడ్డి, రామకృష్ణరెడ్డి హాజరై ఆవిష్కరించారు. అనంతరం వారిని విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఏఐసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెల అల్‌ఫ్రెడ్‌రాజు, మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్‌బాబు తహసీల్దార్ దేవ చంద్రశేఖర్, ఎంపీడీవో మణిమంజరి, ఏవోలు జీర గణేష్, వికాస్‌తేజ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం: తిక్కారెడ్డి

కోసిగి: నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు ,కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆ పార్టీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. కోసిగికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పెండ్యాల రమేష్‌శెట్టి అనారోగ్యంతో చికిత్స పొంది కోసిగిలోని స్వగృహంకు రావడంతో శుక్రవారం తిక్కారెడ్డి పరామర్శించారు. జ్ఞానేష్, అయ్యన్న, వక్రాణి వెంకటేష్, పంపాపతి, కోసిగయ్య, మాదేవ పాల్గొన్నారు.

సీఎం జగన్ ముస్లింల ద్రోహి

గోనెగండ్ల, జనవరి 5: ముస్లిం, మైనార్టీల ఆస్తులకు, ప్రాణాలకు జగన్ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని, సీఎం జగన్ ముస్లింల ద్రోహిగా మిగిలిపోయారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీవీ స్వగృహంలో గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన 50 ముస్లిం కుటుంబాలు ఎర్రబాడు టీడీపీ నాయకుడు శ్రీనివాసులు, మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీవీ సమక్షంలో చేరాయి. మౌలా, మొహమ్మద్, బీలాల్, మోదీన్, షేక్షా, మదార్‌వలి, మబ్బాషా, బడేసాబ్, కటిక బాంద్, పెద్ద బాషా, సొదీరసూల్, ఖాసీంవలి, అల్లావలి, కోట మాబ్బాషా, రఫీ, షేక్షావలి, కటిక మాబ్బాషా, సుబాన్, ఇమామ్‌సాబ్, బడేసాబ్, షరీఫ్ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి బీవీ జయనాగేశ్వరరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ఆలూరు, జనవరి 5: ఓటు వజ్రాయుధం అని తహసీల్దార్ రామాంజినేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఈవీఎంలపై ప్రజలకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గుం డాల నాయక్, ఆర్ఐ బసవన్న గౌడ్, పాల్గొన్నారు.

బీసీలకు గుర్తింపు తెచ్చింది టీడీపీనే: మాజీ ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, జనవరి 5: బీసీలకు రాజకీయ గుర్తింపు తెచ్చిందే టీడీపీ అని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని 19, 21, 27, 29 వార్డుల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో టీడీపీ జెండాను ఎగురవేసి ఎన్టీఆర్, బీవీ చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి మాట్లాడారు.గోనెగండ్ల మండలంలోని ఎర్రబాడు గ్రామంలో మైనార్టీ బిడ్డ అత్యాచారానికి గురైతే పట్టించుకునే నాథుడే లేడన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగితే గన్‌కంటే జగన్ ముందు వస్తారని చెప్పుకుంటున్నారని.. మరి ఆయన ఎక్కడ అని ప్రశ్నించారు. అలాగే గంజల్ల గ్రామంలో బీసీ బాలికపై అత్యాచారయత్నం జరిగితే చర్యలు లేవని అన్నారు. ఈ ఐదేళ్లలో జగన్ నొక్కింది బటన్ కాదని పేద ప్రజల పీక నొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పంటలు నాశనమైతే ఈ ఎమ్మెల్యే పలకరించిన పాపాన పోలేదని విమర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దయాసాగర్, నాయకులు భాస్కర్, ఎరుకల పరమేష్, అల్తాఫ్, దేవేంద్ర, కృష్ణతేజ నాయుడు, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. తెలుగు యువత అధ్యక్షుడు మండల రంగస్వామినాయుడు, పార్టీ మైనార్టీ తాలుకా నాయకులు నూరహ్మద్, కొత్తింటి ఫకృద్దీన్, బారతం రహంతుల్లా మాట్లాడుతూ 5వ తేదీ వచ్చినా పింఛన్ అందలేదన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే గురువారం పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారని, అయితే లబ్ధిదారులకు పింఛన్ ఇవ్వకుండా ఇంటికి పంపించారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్, బీవీ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

200 కుటుంబాల వలస



గుంటూరుకు వలస వెళుతున్న కూలీలు

కోసిగి, జనవరి 5: ఒకేరోజు కోసిగి నుంచి 200 కుటుంబాలు గుంటూరుకు వలస వెళ్లాయి. పశ్చిమ ప్రాంతంలో ఇప్పటికే పనులు, ఉపాధి లేక గ్రామ, గ్రామాలు వలసలు వెళ్లగా శుక్రవారం కోసిగిలోని 2, 3, 6, 9వార్డుల నుంచి సుమారు 9వాహనాల్లో 200 కుటుంబాలు పిల్లపాపలతో గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వలస వెళ్లారు.

రాములవారి విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం

ఆదోని టౌన్, జనవరి 5: అయోధ్యలో జరిగే రాముల వారి విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ వారి తరపున విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యాలయం నాయకులు మంత్రాలయం రాఘ వేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థ స్వామివారికి శుక్రవారం అందజేశారు. వీహెచ్‌పీ నాయకులు ప్రాణేష్, మహేష్, సుబ్రహ్మణ్యం, బసన్న గౌడ్, సాకెరే ఈరన్న రావు, అంజనేయులు, పంపాపతి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

క్రిష్ణగిరి, జనవరి 5: క్రిష్ణగిరి సమీపంలోని కొత్తపల్లె దారిలో రూ.2,80లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం వెల్దుర్తి ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ట్రాలీ వాహనంలో మద్యం తీసుకెళ్తుండగా కొత్తపల్లె రహదారిలో పోలీసులు దాడి చేసి 70 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి పరారయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదోని రూరల్: ఆదోని పట్టణం అమరావతి నగర్‌కు చెందిన రాజు శుక్రవారం సంతేకూడ్లూరు బస్టాండు సమీపంలో కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నారని సమాచారంతో ఇస్సీ పోలీసులు దాడి చేసి అతడిని అరెస్టు చేశారు. అతడి నుంచి 4 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అలాగే ఆదోని మండలం దొడ్డనగేరికి చెందిన హుసేన్ శుక్రవారం ఇంటి సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పెద్దతుంబళం పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 50 కర్ణాటక ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదోని రూరల్, జనవరి 5: ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన మంచాల మహబూబ్ బాషా(30) చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహబూబ్ బాషా గత నెల 26న గౌండ పని చేయడానికి ద్విచక్ర వాహనంలో మాధవరం వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చే క్రమంలో వాహనం అదుపు తప్పి పెద్దతుంబళం శివార్లలో ఉన్న పెట్రోలు బంకు వద్ద ప్రమాదానికి గురైంది. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. కోలుకోలేక గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చిప్పగిరి, జనవరి 5: మండల కేంద్రమైన చిప్పగిరిలోని భోగలింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 11 మందిని చిప్పగిరి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం చిప్పగిరి పోలీసులుకు అందిన సమాచా రం మేరకు దాడులు నిర్వహించి 11 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.1.55 లక్షలు నగదును, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మంత్రాలయం, జనవరి 5: మండలంలోని మాధవరం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ పెద్దకడబూరు మండల కార్యదర్శి బోయ గోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాలివీ.. పెద్దకడుబూరు మండలం హెచ్.మురవళి గ్రామానికి గోపాల్ మాధవరం నుంచి హెచ్.మురవళి గ్రామానికి బైక్‌పై వెళుతుండగా ఆదోని రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడింది. గోపాల్ తీవ్రంగా గాయపడడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల స్థలాల్లో వైసీపీ నాయకుల పెత్తనమా ?

మద్దికెర, జనవరి 5: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో రైతులు, పేదల స్థలాల్లో అధికార పార్టీ నాయకుల పెత్తనం ఏమిటంటూ మండల ఎస్సీ సెల్ టీడీపీ నాయకులు ఆనంద్ కుమార్, మాజీ ఎంపీటీసీ శివశంకర్, రమేష్ ప్రశ్నించారు. శుక్రవారం ఎం.అగ్రహారం గ్రామంలో వారు మాట్లాడుతూ 261 సర్వే.నెంబరులో ఎకరా 87 సెంట్లు పంచాయతీ స్థలం ఉందన్నారు. ఆ స్థలాల్లో రైతులు వాముదొడ్లను వేసుకున్నారని అయితే.. అధికార పార్టీకి చెందిన నాయకులు కావాలనే గ్రామంలో కక్షలు రేపుతున్నారన్నారు. పట్టాలు ఇవ్వకుండా పొజిషిన్ సర్టిఫికెటు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఆ స్థలంలో ఇప్పటికే గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే కేంద్రాలు నిర్మించారని తెలిపారు. అయితే..అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు రాత్రికి రాత్రే రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పొజిషిన్ సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పొజిషిన్ సర్టిఫికెట్లు రద్దు చేసి ఆ స్థలాన్ని పంచాయతీకి అప్పగించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పెసరబండ క్రిష్ణయ్య, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

టీడీపీ కార్యకర్తలను ఆదుకుంటాం

ఆదోని, జనవరి 5: టీడీపీ కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటామని 19 వార్డు ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆచారి అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న ముస్లిం మైనార్టీకి చెందిన రసూల్ బాషా అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే దివాకర్ నగర్ చెందిన అమీర్ బాషా పక్షవాతంతో అరోగ్యం క్షీణించి మృతి చెందారని అన్నారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పో వడంతో ఆ కుటుంబాలకు రూ.10 వేల నగదు ఆర్థిక సాయం అందజే శారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డిష్ ఈరన్న, ధర్మ, రవి, నరేంద్ర, రాందాస్, సురేంద్ర వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌లు ఐక్యంగా ఉండాలి

ఎమ్మిగనూరు, జనవరి 5: వీరశైవ లింగాయతులు ఐక్యంగా ఉండాలని వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై రుద్రగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బసవేశ్వర వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం 2024 క్యాలెండర్‌ను గౌడ్ ఆవిష్కరించారు. వీరశైవుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జీబి నాగరాజు గౌడ్, మూర్తి, ఆలే ఈరన్న, గుల్లప్ప, టైలర్ పరమేశప్ప, రఘు, టీచర్ ఈరన్న, ఇంద్రసేనా రెడ్డి, అయ్యన్న, ఆదెప్పలు పాల్గొన్నారు.

కప్పట్రాళ్లలో డీఎస్పీ పర్యటన

దేవనకొండ, జనవరి 5: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామమైన కప్పట్రాళ్లలో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి శుక్రవారం రాత్రి పర్యటించారు. ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని గ్రామస్తులకు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. డీఎస్పీ వెంట ఎస్ఐ భూపాలుడు , పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

మంత్రాలయం, జనవరి 5: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో ఆవిష్కరించిన విగ్రహానికి టీటీడీ బోర్డు సభ్యులు సీతారామిరెడ్డి రూ.50 వేలు, మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి రూ.50వేలు, మంత్రాలయం టీడీపీ నాయకుడు మాధవరం రామకృష్ణారెడ్డి రూ.20వేలు విరాళాలు ఇచ్చారు. అదే విదంగా శుక్రవారం గత రెండు రోజుల క్రితం విద్యుత్ షాట్ సర్క్యూట్‌కు దగ్ధమైన కిరాణ కొట్టు యజమాని ఈడిగ గోపాల్‌కు టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవదాసు, రోగెప్ప, అనిల్, యేసేబు, రాజేంద్ర, మాణిక్యరాజు పాల్గొన్నారు.

రామాలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

ఆదోని టౌన్, జనవరి 5: అయోధ్యలో ఈనెల 22న జరిగే రామాలయ ప్రారంభోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ పిలుపునిచ్చారు. శుక్రవారం రామాలయం నుండి వచ్చిన పవిత్ర అక్షింతలను వీధులలో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక కిలిచినపేట, శుక్రవారంపేట కాలనీవాసులకు అందజేశారు. కార్యక్రమంలో ఆదూరి విజయకృష్ణ, జిందే సాయికుమార్, పొందే ఈరన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

'స్వామి వివేకానంద యువతకు ఆదర్శప్రాయం'

కోసిగి, జనవరి 5: స్వామి వివేకానంద యువతకు ఆదర్శ ప్రాయుడని వివేకానంద చూపిన బాటలో యువత నడవాలని కోసిగి బాలుర పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతిని నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఏబీవీపీ నాయకులు వినోద్ కుమార్, వీరేష్, ఉశేనీ, నరేంద్ర, మద్రిస్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు, జనవరి 5: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరు మండలంలోని అరికేర డా.బీఆర్ అంబేడ్కర్ గురుకు లంలో ఈనెల 12, 13 తేదీల్లో కర్నూలులో జరిగే ఎస్టీయూ 75వ వజ్రో త్సవాల పోస్టర్లను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో విడుదల చేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో సీఎం జగన్ హామీ ఇచ్చిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రదీప్, నరసింహులు, నబీరసూల్, రాజశేఖర్, అచ్చెయ్య, శ్రీనివాసులు బాలచంద్రుడు, బసవరాజు, భీమన్న, లక్ష్మన్న, బాల చంద్రుడు, ప్రశాంత్, విద్యాసాగర్, అనిల్, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఆదోని టౌన్, జనవరి 5: మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాచోటి రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మమ్మ ఆధ్యాత్మిక కేంద్రంలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు జనరల్ క్విజ్ పోటీలను నిర్వహించారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అనేక గ్రామీణ ప్రాంతాల నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈపోటీల్లో ప్రథమ స్థానంలో లక్ష్మీదేవి, ఎంజేపీబీసీడబ్ల్యూ స్కూల్, (ఆరే కల్), రెండో స్థానంలో ఆప్రియా ప్రతిభ పబ్లిక్ స్కూల్ (కౌతాళం), మూడో స్థానంలో దీపిక విద్యాశ్రీ స్కూల్, జితేంద్ర భాష్యం స్కూల్ నిలిచింది. ఈపోటీలను ఆర్‌ఎంజి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

సనాతన పరంపరను కాపాడుకోవాలి

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 5: భారతీయ సనాతన వైదిక ధర్మ పరంపరను కాపాడుకోవాలని టీటీడీ ధర్మ ప్రచార కన్వీనర్ డాక్టర్ మల్లు వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదోని పట్టణం, ఇందిరానగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ సనాతన పరంపర విశిష్టమైనదని అన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసన్న గౌడ పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

మద్దికెర, జనవరి 5: గంగమ్మవ్వకు రజక సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక మద్దమ్మకుంట సమీపాన వెలసిన గంగమ్మ ఆలయంలో గంగమ్మవ్వకు పూజలు నిర్వహించారు. సాయంత్రం గంగమ్మవ్వకు ఊరేగింపు నిర్వహించారు. నాయకులు చాకలి నాగేష్, చిరంజీవి, రంగన్న, శివ, పెద్ద రంగన్న పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

కోసిగి, జనవరి 5: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామయ్య అక్షింతలను బజరంగ్‌దళ్ నాయకులు శుక్రవారం కోసిగిలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నాడిగేని అయ్యన్నకు అందజేశారు. గవిగట్టు ఈరయ్య, నాయకులు భోంపల్లి వెంకటేశ్, గోపాల్, శ్రీరాములు ఉన్నారు.

అంగన్‌వాడీ ఆయాకు గాయాలు

వెల్దుర్తి, జనవరి 5: మండలంలో లింగాలపల్లె గ్రామానికి చెందిన అంగన్‌వాడీ హెల్పర్ దస్తగిరమ్మ ప్రమాదవశాత్తు బైక్ మీద నుంచి కింద పడి తలకు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వెల్దుర్తి ప్రాజెక్టు రామళ్ళకోట సెక్టార్ లింగాలపల్లెలో అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న దస్తగిరమ్మ అంగన్‌వాడీలు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి వెల్దుర్తికి రావడానికి బైక్ లిఫ్ట్ అడిగి బయలుదేరారు. మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు బైక్ మీద నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.